క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాలలో బధిరుల చేరికకు అవకాశం

భట్టిప్రోలువ: భట్టిప్రోలు మండల పరిధిలోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చెవిటి, మూగ విద్యార్థులను బాపట్లలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో చేర్పించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఆసక్తి గల తల్లిదండ్రులు సంప్రదించాలని ఎంఈవో పులి లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన, కంప్యూటర్ విద్య, ఉచిత భోజన వసతి, వైద్య సౌకర్యంతోపాటు ప్రభుత్వం కల్పించే అన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 90000 13633, 99633 03501 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే చెల్లించాలి



వేమూరు: ఉపాధి కూలీలకు వేతనాలు వెంటనే విడదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. అగస్టీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేమూరులో ఉపాధి పని ప్రదేశాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. పని చేసిన 15 రోజుల లోపు ఉపాధి వేతనాలు ఇవ్వాలని 5 వారాలైనా ఇంత వరకు విడుదల చేయలేదని ఆరోపించారు. ఎక్కువ మంది ఈ పథకంపై అధారపడి ఉన్నారు. డబ్బులు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గ్రామంలో ఉపాధి పథకం కూలీలు 600 మంది ఉన్నారు. ప్రభుత్వం అధికారులు 50 మందికి పని కల్పించడం చాలా దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే పనులకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ కొలుపుల మహోత్సవం



బాపట్ల: గ్రామ కొలుపులు సందర్భంగా మహాలక్ష్మమ్మ చెట్టుకు భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శీలంవారివీధిలోని చెట్టుకు, గడియార స్తంభం వద్ద ఉన్న పోలేరమ్మ తల్లికి మహిళలు పూజలు చేశారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ పూజలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

'చంద్రబాబు అన్ని హామీలు అమలు చేయాలి'

భట్టిప్రోలు: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు అన్నారు. శుక్రవారం భట్టిప్రోలులోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు ప్రమాదకరమైన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు రద్దు చేస్తూ సంతకం చేయడం అభినందనీయమన్నారు. పింఛన్ మొత్తం పెంచడంపై లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఇతర హామీలను కూడా అమలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు జి. బాలాజీ, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి

తెనాలి అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ బి.ప్రసన్న పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. సత్యం, శివం, సుందరం, సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, షేక్ షఫీ, మాలేపాటి హేమ్‌కుమార్, తదితరులు రక్తదానం చేశారు. వారిని ఆమె అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.

16న యాదవ విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలు

తెనాలి: యాదవ ఎంప్లాయిస్ ఫెడరేషన్, తెనాలి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల అభినందన సభను ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు రైల్వేస్టేషన్ రోడ్‌లోని బృందావనం రెసిడెన్సీలో జరిగే సభలో విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలతోపాటు విద్యారంగ నిపుణులతో కెరీర్ గైడెన్స్ ఉంటుందని ఫెడరేషన్ నిర్వాహకులు ఎనికపల్లి అంబరీషుడు, అంగిరేకుల ప్రసాద్‌బాబు, కుర్రా శ్రీనివాసరావు, తాడిబోయిన శ్రీనివాసపండిట్, ఆరాధ్యుల నాగాంజనేయులు, తాడిబోయిన లక్ష్మీనారాయణ, కొత్తగొర్ల శ్రీనివాస్‌లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి గత మార్చిలో ఉత్తీర్ణులైన యాదవ విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

వెద సాగు.. బహు బాగు

- వ్యవసాయంలో ఈ విధానంతో బహుళ ప్రయోజనాలు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



వెద సాగు కోసం ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

కొల్లిపర: ఖరీఫ్ ప్రారంభమైంది... ఇప్పటికే రైతులు పొలాల్లో ట్రాక్టర్లతో దుక్కులు పెడుతున్నారు. తెనాలి నియోజకవర్గంలోని తెనాలి, కొల్లిపర మండలాల్లో సుమారు ఈ రబీ సీజన్‌లో 27 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. తెనాలిలో 13,533 కొల్లిపరలో 12,482 ఎకరాల్లో ఖరీఫ్‌లో సాగు పనులు చేపట్టనున్నారు. ఇందులో వెద పద్ధతిలో 70 శాతం రైతులు సిద్ధం అవుతున్నారు.

సాధారణ విధానంలో నాట్లు వేసే రైతులకు.. దిగుబడి, నాణ్యమైన పంట చేతికి వచ్చినప్పటికీ పెట్టుబడి అధికం అవుతుంటుంది. అందుకే వెద పద్ధతిలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీని ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే అవకాశం ఉంది. ప్రధానంగా మారిన వాతావరణ పరిస్థితుల్లో తక్కువ నీటితో లాభదాయకంగా దిగుబడులు పొందవచ్చు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సాగు ఆలస్యమైనప్పుడు వెద విధానం వల్ల సమయం ఆదా చేయవచ్చు.

ప్రయోజనాలు ఎన్నో...

- తొలకరి వర్షాలు సద్వినియోగం చేసుకోవచ్చు.
- నారుమడి పెంపకం, నాట్లకు అయ్యే ఖర్చు సుమారు ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు మిగులుతుంది.
- విత్తన మోతాదు 40-50 శాతం తగ్గించుకోవచ్చు.
- చెరువులు, కాలువల కింద సాగు చేసే వారు నాట్లు సకాలంలో వేసుకోవచ్చు.
- పంట నేలకు వాలిపోకుండా 10 నుంచి 15 రోజులు ముందు కోత కోసుకోవచ్చు.
- తెగులు, పురుగుల బెడద తగ్గించుకోవచ్చు.
- కోత యంత్రాలతో సులువుగా కోసుకోవచ్చు.

విత్తన రకాల ఎంపిక ఇలా...

- లోతట్టు, ముంపు ప్రాంతాలకు అనువైన రకాలు: ఎంటీయూ (1061) ఇంద్ర, ఎంటీయూ(1064) అమర , ఆర్‌జీఎల్ (2537) శ్రీకాకుళం సన్నాలు ఎత్తు ఎదిగి కాండం ధృడంగా ఉంటుంది. పడిపోని రకాలు సాగు చేసుకోవాలి.
- సాధారణ కాలువలు, చెరువుల కింద పొలాల్లో..: ఎంటీయూ 1121 (శ్రీధృతి), ఎంటీయూ 3291 (సోనామసూరి) , బీపీటీ 5204 (సాంబమసూరి), ఎంటీయూ 1210(సుజాత), ఎంటీయూ 1262 (మార్టేర్ సాంబ), ఎంటీయూ 7029 (స్వర్ణ) వేసుకోవాలి.
- కాలువ చివరి భూములు, ఆలస్యంగా విత్తే ప్రాంతాలకు అనువైన రకాలు: ఎంటీయూ 1156(తరంగణి), ఎంటీయూ 1153 (చంద్ర) , ఎస్ఎల్ఆర్ 34449 రకాలను ఎంచుకోవచ్చు.

వెద సాగులో నేల తయారీ ఇలా....

వర్షాలు పడిన వెంటనే నేలను పలుమార్లు దున్ని మెత్తగా తయారు చేయాలి. తర్వాత కలుపు సమస్య కొంత వరకూ అధిగమించవచ్చు. ఆఖరి దుక్కిలో వ్యవసాయాధికారుల సిఫారసు మేరకు భాస్వరం, పొటాష్ ఎరువులు లేదా వేప పిండి, ఆముదం పిండి , గొర్రె ఎరువు వంటి తదితర వాటిని వేసి నేలను కలియ దున్నాలి. నేలలో తేమ సరిగా లేకపోతే మొలక రాదు. తేమను చూసుకొని రొటావేటర్‌తో విత్తనాలు వేసుకోవడం మంచిది. కాలిబాటల వల్ల పైరుకు వెలుతురు, గాలి తగలడం, ఎరువులు సులువుగా వేసుకోవడం, చీడపీడల నివారణ తదితర ప్రయోజనాలు ఉన్నాయి. విత్తనాలు మొలక వచ్చిన తరువాత మొక్కలు లేని చోట వరి నారు తీసుకుని నాటవచ్చు.

అధిక దిగుబడులకు ఇలా..

- పంట పడిపోని, త్వరితగతిన కలుపు నివారణకు గల రకాలు ఎంచుకోవాలి.
- సరైన సమయంలో తగిన మోతాదులో కలుపు మందు పిచికారీ చేయాలి.
- కలుపు మందు పిచికారీ చేసే సమయంలో పొలంలో నీరు పలుచగా ఉండేటట్లు చేసుకోవాలి. తర్వాత కూడా రెండు రోజుల వరకూ నీరు నిల్వ ఉండేలా జాగ్రత్తలు అవసరం.
- విత్తిన 15 రోజులకు పిలక దశలో చిరుపొట్ట దశలో ఎరువులు వేయాలి.
- పొటాష్ ఎరువును విధిగా చిరుపొట్ట దశలో నత్రజనితోపాటు వేయాలి.
- చేనును కోత కోసే వారం రోజులు ముందు మాత్రమే ఎండగట్టాలి.

మంచి విత్తనాలు వేసుకోవాలి



రైతులు వెద పద్ధతిలో సాగు చేయడానికి ప్రస్తుతానికి అనుకూలమైన వాతావరణం ఉంది. ఇలా వరి సాగు చేసేటప్పుడు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విధంగా విత్తనాలు చల్లుకోవాలి. సన్న రకాలు అయితే ఎకరాకు 18 కిలోలు, ముతక రకాలు 20 నుంచి 22 కేజీలు వేసుకోవాలి. ఒత్తుగా వేయడం వల్ల చేతికి వచ్చే సమయంలో పంట పడిపోయే ప్రమాదం ఉంది. ఒత్తుగా ఉండి నేలకు గాలి తగలకపోతే చీడపీడలు సోకుతాయి. కాలిబాటలు తప్పనిసరి. నత్రజని తగ్గించుకోవాలి. సీ డ్రిల్‌తో విత్తనాలు వేయడం వల్ల ప్రయోజనాలు ఉంటాయి. విత్తన శుద్ధి ప్రధానం.

– కె.వెంకటరావు , కొల్లిపర మండల వ్యవసాయాధికారి

నాటిక రచనల పోటీలు

తెనాలి: గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో అమ్మ ఇతివృత్తంతో గోవాడ మల్లీశ్వరి స్మారక నాటిక రచనల పోటీలను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం తెనాలిలో ఒక ప్రకటనలో తెలిపారు. నాటికలు ప్రయోగాత్మక/ ప్రతీకాత్మక ప్రదర్శనకు అనువుగా, 45 – 60 నిమిషాల నడుమ ఉండాలని సూచించారు. రచనల మూడు ప్రతులను 30వ తేదీలోగా వెంకట్ గోవాడ, గోవాడ క్రియేషన్ 5-1-44, శ్రీవీరాంజనేయ కాలనీ, సాహెబ్‌నగర్, వనస్థలిపురం, హైదరాబాద్-500070 అనే చిరునామాకు పంపాలని కోరారు.

19 నుంచి శ్రీదత్తసాయి ప్రేమ మందిరం ప్రతిష్ఠ వార్షికోత్సవాలు

ఈమని(తెనాలి): దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం 18వ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి జరగనున్నాయి. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాలను తొలిరోజు ఉదయం ఆరు గంటలకు పతాకావిష్కరణతో ప్రారంభిస్తారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదాయ భజనలు చేస్తారు. రెండోరోజైన 20న ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీసాయి సచ్చరిత్ర సామూహిక పారాయణం ఉంటుంది. తెనాలి మారీస్‌పేటలోని శ్రీసాయి సన్నిధి నిర్వాహకులు హెచ్ఆర్ లక్కరాజు నిర్వహిస్తారు. చివరిరోజైన 21న శ్రీసాయిబాబాకు విశేష అభిషేకాలు, అనంతరం శ్రీసాయి మంత్ర జప తర్పణ హోమాలు, మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ జరుగుతుందని తెలిపారు. అదేరోజు రాత్రి 8.30 గంటల నుంచి శ్రీమహానందీశ్వర నాట్యమండలి-తెనాలి వారిచే గయోపాఖ్యానం నాటకంలో యుద్ధఘట్టం, సత్యహరిశ్చంద్రీయం నాటకంలో కాటి సీను ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

ఆనాడే గంజాయిపై ఉక్కుపాదం

- వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలోనే నిందితులపై గట్టి చర్యలు
- గత ఆరు నెలల్లో 25 మందికిపైగా అరెస్ట్ చేసిన తెనాలి పోలీసులు



ఫిబ్రవరి 12న ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి విక్రేతల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి రూరల్: గంజాయిపై పోలీసులు కొంతకాలంగా ఉక్కుపాదం మోపుతూ వస్తున్నారు. నియోజకవర్గంలో గంజాయి విక్రయాలను నిరోధించేందుకు కృషి చేస్తున్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాత్రమే పోలీసులు చర్యలు చేపట్టారంటూ కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రచారం మొదలు పెట్టారు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న రోజుల్లోనే పోలీసులు చర్యలు చేపట్టారు. పోలీసులతో జరిపిన సమీక్షా సమావేశంలో అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సైతం గంజాయి విక్రయాలు, వినియోగాన్ని నిరోధించాలని ఆదేశించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలకు చెందిన కొందరు తాజాగా చర్యలు ప్రారంభించినట్లు పేర్కొనడం గమనార్హం. గత ఆరు నెలల్లో పోలీసులు 25 మందికిపైగా గంజాయి విక్రేతలను అరెస్ట్ చేశారు.

ఇవిగో నిదర్శనాలు...

- 2023 డిసెంబరు 20వ తేదీన తెనాలి మండలం ఖాజీపేట గ్రామం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నందివెలుగుకు చెందిన తన్నీరు అనిల్ కుమార్ అనుమానాస్పదంగా కనిపించాడు. తనిఖీ చేయగా 745 గ్రాముల గంజాయి లభించింది. అదుపులోకి తీసుకుని విచారించగా, విశాఖపట్నం సమీపంలోని పాడేరు నుంచి గంజాయి తీసుకు వచ్చి తెనాలి పరిసర ప్రాంతాలు, దుగ్గిరాలలో విక్రయిస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు.
- చెడు వ్యసనాలకు బానిసలైన కొందరు సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎనిమిది మంది సభ్యుల ముఠాను త్రీ టౌన్ పోలీసులు ఫిబ్రవరి 12వ తేదీన అరెస్ట్ చేశారు. పట్టణ ఆర్ఆర్ నగర్‌కు చెందిన షేక్ నాగూరా, ఐతానగర్‌కు చెందిన రాహుత్ సల్మాన్ సీఎం కాలనీకి చెందిన మండూరి ఏడుకొండలు, సింహాద్రి పూర్ణచంద్, బాలాజీరావుపేట మహేంద్ర కాలనీకి చెందిన బల్లం భీమరాజు, ఐతానగర్‌కు చెందిన జ్యోతుల రాజ్‌పాల్, ద్వారకా నగర్‌కు చెందిన మక్కెన చంద్రకిరణ్, ఐతానగర్‌కు చెందిన ఉప్పుతోళ్ల స్వామి పాత నేరస్తులు. జల్సాలు, గంజాయికి అలవాటు పడిన వీరు తేలికగా డబ్బు సంపాదించేందుకు కొంత కాలంగా గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. నర్సీపట్నం వెళ్లి అక్కడ నాలుగు కిలోల గంజాయిని రూ. 10 వేలకు కొని ఇక్కడ పొట్లాలు కట్టి విక్రయిస్తున్నట్లు పోలీసులు విలేకర్ల సమావేశంలో తెలిపారు.
- మార్చి 4వ తేదీన సంగంజాగర్లమూడికి చెందిన మహమ్మద్ అబ్దుల్ రషీద్, తెనాలి నందులపేటకు చెందిన కోటి సాయిమంజునాథ్, దేవరకొండ మను శివశంకర్, బుర్రిపాలెం రోడ్డు బీసీ కాలనీకి చెందిన కోట సురేంద్రలను త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి చిన్న చిన్న పొట్లాల్లో ఉంచిన 1.20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- కొల్లిపరకు చెందిన పాముల రుషిబాబు, తూమాటి శ్యాంకుమార్ అలియాస్ చిన్న సన్నీ, మంద్రు రాజ్‌కుమార్ అలియాస్ పెద్ద సన్నీ, మల్లోల శోభన్‌బాబుతో కలసి తుని వెవెళ్లి అక్కడ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేశారు. తెనాలి తీసుకువచ్చి రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారని టూ టౌన్‌పోలీసులకు సమాచారం అందింది. వీరిపై నిఘా ఉంచిన పోలీసులు మార్చి 5వ తదీన అరెస్ట్ చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- తాజాగా ఈ నెల 10వ తేదీన త్రీ టౌన్ పోలీసులు గంజాయి విక్రయిస్తున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. ఏడాది కాలంగా తెనాలిలో ఉంటూ టైలర్‌గా పని చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహమ్మద్ షఫి సర్దార్ ఒడిశా నుండి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఇతనికి మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ రహమాన్, డొంక రోడ్డుకు చెందిన రాపోలు నరసింహారావు, చెంచుపేట భాను టీ స్టాల్ సమీపంలో నివసించే జమ్మలమూడి గోపి, పాండురంగపేటకు చెందిన దిడ్ల ప్రభుదేవ, పినపాడుకు చెందిన ఆకురాతి భరత్, మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన సయ్యద్ మహమ్మద్ సోహైల్, డొంకరోడ్డుకు చెందిన కొమ్మతోటి పాలరాజులతో పరిచయమైంది. వీరందరూ కలిసి గంజాయిని విక్రయిస్తున్నారు. పొట్లాలు కడుతూ పోలీసులకు చిక్కారు.
- ఎప్పటికప్పుడు పోలీసులు గంజాయి విక్రయాలపై కొరడా ఝుళిపిస్తూనే ఉన్నా, కూటమి అధికారంలోకి వచ్చాకే గంజాయి విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారంటూ టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తున్న తప్పుడు ప్రచారంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టీ.వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్ : ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక న్యాయవాదులను ఏర్పాటు చేస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ టీ.వెంకటేశ్వర్లు తెలిపారు. మండల న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సబ్‌జైలులో ఖైదీలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసులను సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేసే దిశగా న్యాయశాఖ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతి నెల మెగా లోక్ అదాలత్‌ల ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందిస్తుందన్నారు. రిమాండ్‌లో ఉన్న వారు ప్రైవేటు న్యాయవాదుల రుసుములు భరించలేకుంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన న్యాయవాదుల సేవలు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలకు జీవితం అంధకారం అవుతుందన్నారు. సమాజంలో శాంతియుత జీవనం అవలంబిచాలని సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జీ రూపశ్రీ,, సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కాల్వల పూడికతీత పనులు

- పట్టణంలో 8 ప్రధాన కాల్వల మరమ్మతులకు చర్యలు
- భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న ప్రణాళికలు
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



కాల్వలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలోని ప్రధాన పంట, మురుగు కాల్వల పూడికతీత పనులు ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రధాన కాల్వల పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత స్థానికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెనాలి పట్టణంలో 47 కిలోమీటర్ల మేర 8 ప్రధాన కాల్వలను బాగు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించినట్లు చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొదటి విడత కింద ప్రధాన కాల్వల పూడికతీత పనులు చేపట్టామన్నారు. తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల వ్యర్థాలను ప్రధాన కాల్వల్లో ఇప్పటి వరకు వేయడం జరిగిందన్నారు. దీనివలన కాల్వల్లో చెత్త పేరుకుపోయి పారుదలకు అవరోధంగా మారినట్లు తెలిపారు. కాల్వల్లో ఉన్న వ్యర్థాలను తొలగించడంతోపాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో తెనాలి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చేలా కృషి చేస్తామన్నారు. తెనాలి పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాల్వలపై అక్రమణలు ఎక్కువగా జరిగినట్లు గుర్తించామని తెలిపారు. వాటన్నింటిని తొలగించేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కాల్వల చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా చూస్తామన్నారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నం పిన్నారావు, దివి అనిత, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మలికార్జునరావు, అధికారులు, జనసేన నాయకులు హరిదాసు గౌరిశంకర్, దొడ్డక ఆదినారాయణ, షేక్ జాకీర్, గుణ, బండారు రవి కాంత్, సెట్టిపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సాయి, టీడీపీ నాయకులు కోగంటి శివశంకరరావు, బొల్లినేని బుజ్జి, మంగమూరి యుగంధర్, మహ్మద్ ఇస్మాయేల్ బేగ్, పసుపులేటి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

వేమూరు: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా పలు వర్గాలకు మంచి జరిగిందని ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ .. చంద్రబాబు ఎన్నికల ముందు పింఛన్లు పెంపుదల చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వెంటనే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, మహిళలు, తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



రేపల్లె రూరల్ అగ్నిప్రమాదంలో పలువురు రైతులకు చెందిన 25 ఎకరాల గడ్డివాములు దగ్ధమైన సంఘటన పట్టణంలోని 25వ వార్డులో శుక్రవారం చోటు చేసుకుంది. అగ్నిప్రమాక అధికారి సాంబశివరావు వివరాల మేరకు.. 25వవార్డుకు చెందిన కొలుసు గోవిందు, కొలుసు శ్రీనివాసరావు, కొలుసు రామకృష్ణలకు చెందిన 18 ఎకరాల గడ్డివాము, జీ శ్రీనివాసరావుకు చెందిన 7 ఎకరాల గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో అప్పటికే చాలావరకు గడ్డి కాలిపోయింది. మొత్తం రూ.1.80లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల్లో నాణ్యత పాటించాలి



దుకాణాదారులు, వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

కొల్లూరు: ఖరీఫ్ నేపథ్యంలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాదారులు నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని రేపల్లె ఏడీఏ హుసేన్ ఆదేశించారు. శుక్రవారం కొల్లూరులో సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా దుకాణాదారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిర్దేశిత ధరలకు మాత్రమే విక్రయించడంతో పాటు, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాల మొలకశాతాన్ని పరీక్షించి 85 శాతానికి మించిన విత్తనాలనే విక్రయించాలని సూచించారు. రైతులు సైతం వ్యవసాయశాఖ సూచనలను అనుసరించి అనువైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రవీణ, డీఆర్‌సీ ఏఓ ఆర్. విజయబాబు, మండల వ్యవసాయశాఖాధికారి ఆర్. వెంకటేశ్వరరావు, ఏఈఓ లక్ష్మినందిని పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో బంగారు నగల చోరీ

తెనాలి రూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు కథనం మేరకు.. పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన గుంటూరు శ్యాంబాబు తన కుటుంబసభ్యులతో విజయవాడలోని తమ కుమార్తె వద్దకు ఈ నెల 11వ తేదీన వెళ్లారు. మరుసటి రోజు తెనాలి వచ్చి చూడగా ఇంట్లోని బీరువా తాళం తెరచి ఉంది. అందులో ఉంచిన సుమారు రూ. లక్ష విలువ చేసే బంగారు గొలుసులను దుండగులు చోరీ చేశారు. బాధితుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించగా, టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EP.No:32/2022 in O.S.No:123/2022

Between

Akkineni Satish ...DHR/Plaintiff

Vs

Divi Seetaiah Chowdary...JDR/Defendant

పై నెంబరు ఈ.పిలోని ఈ క్రింది షెడ్యూలు దాఖలు 1వ ఐటమ్ మాత్రం JDR తాలూకు స్థిరాస్తిని పై కోర్టు వారి యెదుట తేది: 04-07-2024 ఉదయం 10.30గం వేలం జరుపబడును. కావున వేలం పాటలో పాల్గొన దలచినవారు పై కోర్టు వారి యెదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.

Item no.1: (Guntur District) Now Bapatla Distict, Potharlanka Village, Bhattiprolu SRO, Tippalakatta Grama Panchayat, Potharlanka Village, an extent of Ac.0.76 cents equivalent to 0.307 Hec. of wet land out of Ac.1.43 cents in S.No.229/4-A bounded by :
East:Land of Divi Mallikharjunna rao,
South :Land of Koneru Srujan Banu,
West : Potharlanka Project Canal,
North : Land of Divi Siva Nagalakshmi
DHr Value: Rs.4,56,000/-
Amin Value Rs.20,00,000/-

Item No.2: (Guntur Dist.) now BapatlaDist. Kolluru Mandal Tippalakatta Gram Panchayat, Potharlanka village an estent of Ac.0.45cents, in S.N0.193/9-A, Ac.0.43 cents in S.No. 193/ 10-A, Ac.0.43 cents in S.No. 193/11-A and Ac.0.99cents in S.No. 193/1. 18-A, (totaling an extent of Ac.2.71 cents equivalent to 1.094 Hec.) of dry land bounded by.
East: Land of Kolli Pandu Ranga Rao, Kolli Vana Kumari etc,
South: Land of Nagisetty Anjayeyulu,
West: Donka some extent, Divi Krishna Mohan etc,
North : Land of Divi Krishna Mohan
D.HR Value. Rs.12,42,600/-,
Amin Value Rs.75,00,000/-

గమనిక : పై నెంబర్ షెడ్యూల్‌లోని ఒకటవ ఐటమ్ మాత్రము వేలం వేయబడును. ఈ.సి దఖాల అన్యాక్రాంతములు లేవు.
వేలం తేది: 04-07-2024
ఫర్‌ధర్ హియరింగ్ : 11-07-2024

షేక్ ఫిరోజ్‌బాషా, పేట ప్రత్యూష, న్యాయవాదులు, తెనాలి.
ఫోన్ : 92930 52501

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, ఉన్నదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com